బస్తీవాసుల ఇళ్లను కూల్చివేస్తే సహించేది లేదు

టౌన్‌ప్లానింగ్ సిబ్బంది నోటీసులు ఇవ్వడంపై బస్తీవాసులు ఆందోళన



నిరసన తెలుపుతున్న స్వామి వివేకానందనగర్ బస్తీవాసులు

చిక్కడపల్లి: గాంధీనగర్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీవాసులు ఇళ్లను కూల్చివేస్తే సహించేది లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం స్వామి వివేకానందనగర్ సమాజ్ అధ్యక్షుడు ఎస్. ఎల్లం, సలహాదారులు ఎస్.సాయిలు, దేవయ్య, గోపాల్‌లు మాట్లాడుతూ బస్తీలో ఇళ్లు ఖాళీ చేయాలనిలేకపోతే కూల్చివేస్తామని జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది నోటీసులు ఇవ్వడంపై బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడే నివాసముంటున్నామని ఇంటిపన్నుతో పాటు విద్యుత్ నల్లా బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. కాలనీలోని ఇళ్ల సమస్య ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తుండగానే కూల్చివేస్తామని అధికారులు హెచ్చరించడం సరైందికాదన్నారు. 23 కుటుంబాలు జీవిస్తున్న ఈ బస్తీలో వేంటనే ఖాళీ చేయమంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు స్థలాన్ని చూపించాలని, లేకపోతే పట్టాలివ్వాలని కోరారు. ప్రత్యామ్నాయం చూపకుండా పేదలను హింసించడం తగదన్నారు. కార్యక్రమంలో సమాజ్ ఉపాధ్యక్షుడు పి.జాన్, ప్రధాన కార్యదర్శి ఎంబీ కృష్ణ, సంయుక్త కార్యదర్శి కె.రాజేష్, కోశాధికారి జ్ఞానేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆనందరావు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలేరుకు పలువురి శుభాకాంక్షలు



నల్లకుంట: అంబర్‌పేట ఎమ్మెల్యేగా రెండోసారి భారీ మెజారిటీతో గెలుపొందిన కాలేరు వెంకటేష్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం సంగర్ మోచీ కుల సంఘం ప్రధాన కార్యదర్శి పింజరి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలేరును శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో సంఘం సలహాదారులు కె. ప్రభుదాస్, ఎ. గోపి, జి. శివ, హీరాలాల్, కోకా రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్క్ ఆధునీకరణకు త్వరలో కృషి



ఎమ్మెల్యే కాలేరు శుభకాంక్షలు తెలుపుతున్న ఎస్‌బీహెచ్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

అంబర్‌పేట్: ఎస్‌బీహెచ్ కాలనీ అధునీకరణకు త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డితో కలిసి పార్క్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తిరిగి ఎమ్మెల్యేగా ఎన్నికయిన కాలేరు వెంకటేష్‌కు శుభకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీ సమస్యలు, పార్క్ అధునీకరణపై చర్చించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన అంబర్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జ్



అంబర్‌పేట: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం ఎర్రవెల్లి స్వగృహంలో అంబర్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

'నిమ్స్' కొత్త చైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి

- మొదటి నుంచి సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైనం
- శుభాకాంక్షలు తెలిపిన నిమ్స్ ఉద్యోగ సంఘాలు



లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఇక నుంచి నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ కొనసాగుతారు. బొక్కల దవాఖానా నుంచి నిజాం వైద్య విజ్ఞాన సంస్థగా ఎదిగిన మొదలు నిమ్స్ చైర్మన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తూ వస్తున్నారు. అదే క్రమంలో గురువారం రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి నిమ్స్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సీఎంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈయన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్‌రావులు గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ క్రమంలో నిమ్స్ పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శిరందాస్, నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యగౌడ్, సురేష్ బాబులు కొత్త సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ హయాంలో ఆస్పత్రి విస్తరణ అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

10వ తేదీన వైద్యులకు న్యూట్రిషన్‌పై శిక్షణ

పంజగుట్ట: ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరికీ డయాబిటిస్, బీపీ, కొలెస్ట్రాల్ లాంటి ఆరోగ్య సమస్యలు ఉంటున్నాయని వీటన్నింటికీ కారణం సరైన న్యూట్రిషన్ ఫుడ్ లేకపోవడమే అని ఫిజీషియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూట్రిషన్ నిర్వాహకులు డాక్టర్ రాజేందర్ అన్నారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన బంజారాహిల్స్‌లోని హోటల్ రాడిసన్‌బ్లూలో వైద్యులకు, మెడికల్ ప్రొఫెషనర్ లకు న్యూట్రిషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ అమృతతో కలిసి ఆయన మాట్లాడుతూ... ముందుగా వైద్యులకు న్యూట్రిషన్‌పై శిక్షణ ఇస్తే వారు వారివద్దకు వచ్చే రోగులకు సరైన భోజనం తీసుకోవాలని సలహాలు ఇస్తారన్న ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా తరువాత ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగడం ఆనందమని, కానీ ఎలాంటి శిక్షణ లేనివారు కూడా ఇదితింటే మంచిది, అదితింటే మంచిదని చిట్కాలు ఇస్తున్నారని ఇది బాధాకరమైన విషయం అన్నారు.

'మంత్రి వర్గంలో బీసీలకు అన్యాయం'

ఉస్మానియా యూనివర్సిటీ: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ మంత్రి వర్గంలో బీసీ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామిగౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ రాజ్యం అంటే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందనుకున్నాం కానీ.. 7 శాతం గల ఆదిత్య కులాలకు 7 మంత్రి పదవులను కట్టబెట్టి 60 శాతం జనాబా గల బీసీలకు కేవలం 2 పదవులను మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. తర్వాత పూర్తిస్థాయిలో ఏర్పడే మంత్రి వర్గంలోనైనా బీసీలకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

సందడి చేసిన చిన్నారులు

ఉత్సాహంగా తెలంగాణ బాలోత్సవం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జరిగిన బాలోత్సవంలో భాగంగా విద్యార్థుల సైన్స్ ప్రదర్శన



బాలోత్సవంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాల్యం అంటే పుస్తకాలు చదవడం మాత్రమే కాదని ఆటపాటలతోనే బాలల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఎమ్మెల్సీ, ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించిన పిల్లల జాతర 2023 ఆకట్టుకునేలా సాగింది. నగరంలోని 78 పాఠశాలలకు చెందిన 7–10వ తరగతి విద్యార్థులు సుమారు 3 వేల మందికిపైగా పాల్గొని తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధునిక నృత్యాలు, దేశభక్తి గీతాలు, ఏకపాత్రాభినయం , లఘు నాటికలు, బతుకమ్మ సంబరాలు, ఫ్యాన్సీ డ్రెస్, సైన్స్ ఎగ్జిబిషన్ తదితర సంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. ఎక్కడ చూసిన కిక్కిరిసిన విద్యార్థులతో బాలోత్సవం ఉల్లాసంగా, ఉత్సాహంగా కోనసాగింది. విద్యార్థుల కేరింతలతో ఆయా ప్రాంతం దద్దరిల్లింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పిల్లల గురించి ఆలోచించడం అంటే దేశ భవిష్యత్తు గురించి ఆలోచించడమేనన్నారు. పిల్లలు అక్వేరియం చాపల్లా కాకుండా సముద్రంలోని చేపల్లా పెంచాలని సూచించారు. చదువులంటే ఛాందసం కాదని శాస్త్రీయ దృక్పథం అని నేటి నుంచే పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి భూపతివెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య, కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, ఐఏఎస్ అధికారి భారతిహొలికేరి, బాలసాహితి వేత చోక్కారపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి



దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్

కాచిగూడ: తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజా యుద్ధం తప్పదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రకటించారు. గురువారం నారాయణగూడ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన నియంతృత్వ పాలనపై తెలంగాణ ప్రజలు విసుగు చెంది తిరుగుబాటు చేశారని, ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీని అధరించి అధికారం అప్పగించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం తెలంగాణలో దొరల పాలన పోయి పటేల్ రెడ్డిల రాజ్యం వచ్చిందన్నారు. దళిత బహుజన రాజ్యాంగపు హక్కులకు భంగం వాటిల్లితే దళితుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో టీఎస్‌పీఎస్‌సీ పాలక మండలిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో దారి మళ్లిన ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు మూడు లక్షల కోట్ల రూపాయల నిధులను తిరిగి రాబట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వేల ఎకరాల ప్రభుత్వ భూ ములను రియల్ ఎస్టేట్ కార్పొరేట్ దోపిడీ వర్గం నుండి కాపాడాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. దళితులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఎస్సీ, ఎస్టీ చట్టం ను పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నేతలు దాసరి భాస్కర్, బీరం సతీష్ కుమార్, బండారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కులగణన వెంటనే చేపట్టాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు కుల గణన వెంటనే చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. జనగణన వివరాలను కంప్యూటరీకరించాలని ఆయన అన్నారు. గురువారం కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీలైనంత త్వరగా బీసీ, ఎస్సీ, ఎస్టీ కమీషన్ల ద్వారా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టాలన్నారు. అందుకు అన్ని ప్రభుత్వ శాఖలు కమీషన్ల నియంత్రణలో పని చేసేలా ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రగతి భవన్‌ను మహాత్మ జ్యోతిబా పూలే భవన్‌గా మార్చుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేష్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ జలపల్లి కిరణ్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు, ఉద్యోగులు

కాచిగూడ: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసినప్పుడే మెరుగైన ఫలితాలు సాధించవచ్చుని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ డీఆర్ఎం లోకేష్ వైష్ణోయ్ అన్నారు. కుటుంబ సభ్యులతో ఒక్క రోజు గడిపితే తాము పడుతున్న బాధలన్నీ కనుమరుగై ఆనంద జీవితాన్ని గడపవచ్చునని ఆయన అన్నారు. గురువారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో లోకో పైలెట్స్, అసిస్టెంట్ లోకో పైలెట్స్‌తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైల్వేలో లోకో పైలెట్స్, అసిస్టెంట్ లోకో పైలెట్స్ డే ప్రధాన పాత్ర అని వీరు నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.కోటేశ్వర్ రావు, కిరణ్‌కుమార్, జీవన్, ప్రసాద్ కుమార్, శశాంక్ యాదగిరి, స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ మరో పోరాటానికి సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణ సాధన దిశగా మాదిగల హక్కుల సాధనకు, మాదిగల అభివృద్ధికి మరో పోరాటానికి సిద్ధమయ్యేందుకు భవిష్యత్ కార్యాచరణను ప్రకటించడానికి ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా మాదిగలు మరో పోరాటానికి సిద్ధపడినందుకు భవిష్యత్ కార్యచరణ రూపొందించే దిశగా మాదిగలంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగినటు మాదిగలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాలలో వాటా కేటాయింపులు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు బిల్లు పెట్టి బీజేపీ మాదిగలకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో బీజేపీ పార్టీకి ఉన్నటువంటి చిత్తశుద్ధిని ప్రదర్శించుకోవలన్నారు. విద్యార్థి నాయకులు వరిగడ్డి చందు, జన్నారపు జీవన్, ధర్మరపు శ్రీకాంత్, ఎల్.నాగరాజు, కానుగంటి సురేష్, మొగిలిపాక కిరణ్, వెంపటి శ్రీకాంత్, కార్తీక్, మనీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చుతా

బన్సీలాల్‌పేట్: ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చుతానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం పలు బస్తీలు, కాలనీలు, వాకర్స్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. బన్సీలాల్‌పేట్ జీఎస్ఎన్‌యూఆర్ఎం బస్తీ, పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి పుష్పగుచ్చాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. అధికారంతో నిమిత్తం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. సిద్ధయ్య, శ్రీలత, రాజు, శ్రీనివాస్, శ్రీరాములుతో పాటు రణవీర్, క్రిష్ణయాదవ్, లింగం, శ్రీధర్, గిరి, సుదర్శన్ రెడ్డి, కుషాల్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: రాష్ట్రంలో 25లక్షల మంది ఆర్యవైశ్యుల సంక్షేమానికి కోసం రూ. 1000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు హామీని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించారని ఆయన ఆరోపించారు.

9న జాతీయ సదస్సు

అంబర్‌పేట్: చేజింగ్ హరిజాన్స్ లైబ్రరీస్ పై ఈ నెల 9న జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ లైబ్రరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్.లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి చేగోని రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సును నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని సరోజిని నాయుడు వనిత మహావిద్యాలయం గోల్డన్ జూబ్లీ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9866928327 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

రౌడీషీటర్ అరెస్టు



చిక్కడపల్లి: రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరంలోని వివిధ పోలీసుస్టేషన్‌ల పరిధిలో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలకు పాల్పడుతున్న కరడుగట్టిన రౌడీషీటర్‌ను చిక్కడపల్లి పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సీఐ సీతయ్య తెలిపిన మేరకు.. గాంధీనగర్‌లోని న్యూబోయిగూడ జీకె కాలనీ నివాసంలో ఉంటూ ఆటో డ్రైవర్‌గా ఉన్న రౌడీషీటర్ ముందగళ్ల సంతోష్(40) కరడుగట్టిన పేరు మోసిన నేరస్తుడు. పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న ఇతడిపై 5 నాన్‌బెయిలబుల్ వారెంట్లు నమోదు చేసి ఉండడంతో పాటు చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో పలు కేసులు న్నాయి. అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

'దాడులు సరికావు'

పంజగుట్ట: మాదిగ జాతికి జవాబుదారీగా ఉండాల్సిన మాదిగ సంఘం నాయకుడు మేడి పాపయ్య, మరో మాదిగ ఉద్యమ నేత వంగపల్లి శ్రీనివాస్‌పై దాడి చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పలు మాదిగ సంఘాలు పేర్కొన్నాయి. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా అధ్యక్షులు జంగు కనకరాజు మాదిగలు మాట్లాడుతూ... ఈ నెల 2వ తేదీన హబ్సిగూడలోని సుప్రభాత్ హోటల్‌లో మేడి పాపయ్య తోటి ఉద్యమ కారుడు వంగపల్లి శ్రీనివాస్‌పై దాడి చెయ్యడం బాధాకరమన్నారు.

నేడు ఐఐసిటీ ఆడిటోరియంలో సైన్స్, ఇండస్ట్రీ సదస్సు

లాలాపేట: తార్నాకలోని ఐఐసిటీ ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సైన్స్, ఇండస్ట్రీ, సొసైటీ అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు సీసీఎంబి డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కే నందికూరి గురువారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఐఎస్ఎస్ఏ 89వ వార్షిక జనరల్ బాడీ సమావేశాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్ అశుతోష్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సదస్సులో మరో 8 మంది సైంటిస్టులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రగతి భవన్‌కు జ్యోతిరావ్ పూలే నామకరణం పట్ల హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రగతి భవన్‌కు మహాత్మాజ్యోతి రావ్ పూలే పేరు పెట్టడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి యావత్ బీసీల తరఫున ధన్యవాదలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. బీసీ సమస్యల పరిష్కారానికి మహాత్మా జ్యోతి బాపూలే ప్రజా భవన్ వేదిక కావాలని లింగంగౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

23న ప్రాచీన మందిరాల జీర్ణోద్ధరణ

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీర్ణావస్థలో ఉన్న ప్రాచీన మందిరాల పునర్నిర్మాణ కార్యక్రమానికి ఈ నెల 23వ తేదీ శనివారం వైకుంఠ ఏకాదశి రోజున శ్రీకారం చుడుతున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో ఆయన మాట్లాడుతూ... నవగ్రహాలు, నాగదేవత, మరకత లింగం, స్ఫటిక లింగం విగ్రహాలను తయారు చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి రోజున పవిత్రమైన గంగా, యమునా, సరస్వతి మహానదుల జలంతో అభిషేకం , వేద పండితులచే విగ్రహాల ప్రతిష్ఠాపన చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగస్వాములు కావాలనుకునే భక్తులు వివరాలకు సెల్: 99492 38492లో సంప్రదించాలని కోరారు.

ప్రగతి భవన్‌కు పూలే పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నాం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎ.రేవంత్‌రెడ్డికి జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి శుభాభినందలు తెలియజేశారు. సీఎం నివసించే ప్రగతి భవన్‌కు సామాజిక సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే భవన్‌గా పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పూలే ఆశించిన విధంగా రాష్ట్రంలో సబ్బండ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, రంగాల్లో వాటా, సామాజిక న్యాయం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో దక్కుతుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

కాచిగూడ: ముదిరాజ్ కులస్తులను బీసీ (డి) నుంచి బీసీ (ఏ)లో చేర్చాలని అఖిల భారత ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంగా రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు ప్రమాణస్వీకారం చేయడం పట్ల ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చుతూ జీవో 15 ఇచ్చారన్నారు. ముదిరాజ్‌ల చిరకాల వాంఛ బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చి ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ముదిరాజ్‌ల గుండెల్లో చిరస్థాయిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలిపోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ విద్యార్థి ఉద్యమ కుటుంబాలను ఆదుకోవాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులను ఆదుకుంటామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం 1969 తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులను ఆదుకోవాలని 1969 తెలంగాణ విద్యార్థి ఉద్యమ జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు విజ్ఞప్తి చేశారు. గురువారం నింబోలి అడ్డాలో విలేకరులతో మాట్లాడుతూ... 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి కుటుంబాలు నేడు దయనీయ స్థితిలో ఉన్నాయన్నారు. చాలా వరకు విద్యార్థి ఉద్యమకారులు చనిపోగా కేవలం వంద లోపు విద్యార్థి ఉద్యమకారులు ఉన్నారని ఆయన తెలిపారు. ఆనాడు తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలను చేసి జైళ్లలో గడిపి తమ జీవితాలను తెలంగాణ కోసం అంకితం చేశారని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించనున్నట్లు తెలిపారు. గతంలో అనేక సార్లు అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేసినా కనీసం తమను కలవడానికి కూడా ఇష్టపడలేదని ఆరోపించారు.

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీలకు సంతోషిణి



కాచిగూడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నల్లగొండలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్ అండ్ సెలక్షన్స్‌లో కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీకి చెందిన ఘన సంతోషిణి పాల్గొని 17 ఏళ్ల లోపు బాలికల 60 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఘన సంతోషిణి నారాయణగూడలోని జాహ్నవి ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. టీం మేనేజర్ ఎ.జోసెఫ్, బాలికల టీం కోచ్ హారతి పాల్, బాలరాజ్, జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేయాలి

నల్లకుంట: తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనుముల రేవంత్ రెడ్డికి తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ(టీబీఎస్ఎస్) శుభాకాంక్షలు తెలియజేసింది. గురువారం సాయంత్రం నల్లకుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీబీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె. సురేష్ చంద్ర మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి వాగ్దాటి, ప్రజాకర్షణ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. రాజకీయంగా ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొంటూ పోరాటాలు చేసి సీఎం స్థాయికి ఎదిగారన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్లాలని టీబీఎస్ఎస్ మనస్ఫూర్తిగా కోరుకుంటుందని పేర్కొన్నారు. సమావేశంలో టీబీఎస్ఎస్ ప్రతినిధులు వి.రాజమోహన్, దేశ్‌పాండే, అమర్‌నాథ్, సౌజన్య, రుక్మిణి, బల్వంత్ రావు, సీహెచ్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే కాలేరు



ఎమ్మెల్యే కాలేరును సన్మానిస్తున్న సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు

నల్లకుంట: ఎమ్మెల్యేగా రెండోసారి భారీ మెజారిటీతో గెలుపొందిన కాలేరు వెంకటేష్ పద్మ దంపతులు గురువారం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబాను దర్శించుకున్నారు. సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు ఆ దంపతులకు ఆశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ పాలక మండలి ప్రతినిధులు ఎమ్మెల్యే కాలేరును బాబా శేష వస్త్రంతో సన్మానించి, బాబా ప్రసాదం అందజేశారు.

రేపు 'ఫెర్టీ 9 బేబీ మీట్'

పంజగుట్ట: సంతాన సాఫల్య చికిత్స ద్వారా పిల్లలు కన్న తల్లిదండ్రులు, పిల్లలతో ఈ నెల 9వ తేదీన బేగంపేటలోని హోటల్ గ్రాండ్ కాకతీయాలో 'ఫెర్టీ 9 బేబీ మీట్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫెర్టీ 9 మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.జ్యోతి తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ లోగోను డాక్టర్ శశిప్రియ, డాక్టర్ మౌనిక, డాక్టర్ ఇంద్రజిత్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీనటి స్నేహ హాజరవుతారన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉచిత కన్సల్టెన్సీ, ఉచిత అల్ట్రాసౌండ్ స్కాన్, ఏఎంహెచ్ టెస్ట్, అండాశయ నిల్వ కీలక సూచిక, సంతానోత్పత్తి సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలు, పురుషుల వంధ్యత్వ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే తిరుపతి, రాజమండ్రి, బంజారాహిల్స్, కర్నూలులో కొత్త సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జలసౌధలో సంబరాలు

పంజగుట్ట: రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఎర్రమంజిల్‌లోని జలసౌధలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ సంబరాలు చేసుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ఆనందం వ్యక్తం చేశారు. అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎల్.నాగరాజు మాట్లాడుతూ... త్వరలోనే మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపి తమ సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. రెండేళ్లుగా ఆగిన పదోన్నతులు, మూడు సంవత్సరాలుగా చెల్లించని టీఏ బిల్లులు, నిలిచిపోయిన ఏహెచ్ఏఆర్, కొన్ని చోట్ల నిలిచిపోయిన హెచ్ఆర్ఏ, ఇతర సమస్యలను మంత్రికి వివరిస్తామని తెలిపారు. సంతోష్‌రెడ్డి, ముఖ్య సలహాదారు కుడుములు బుచ్చయ్య, గౌరవాధ్యక్షుడు వేదగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.